క్లుప్తంగా

ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉమ్మడి జిల్లాలో ఏఎన్ఎం పోస్టుల నియామకపు నోటిఫికేషన్ తక్షణం విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ నాయకత్వంలో అనేక ఉద్యమాలు, ఆందోళనలు చేయడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వాలు ఏఎన్ఎం పోస్టుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి. శాంతమ్మ పాల్గొన్నారు.

10 న కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 10వ తేదీన ఇమామ్ మౌజన్‌లకు జీతాలను వెంటనే చెల్లించాలని ఆప్ కి ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆప్ కి ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ షాజహాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి చాన్ బాషా పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతోందన్నారు. గత ప్రభుత్వ కాలంలో మూడు నెలలు పెండింగ్ వేతనాలు ఉన్నాయని మొత్తం 11 నెలల వేతనం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నదని వారన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ పాఠశాలలలో సంవత్సరాల తరబడి పనిచేస్తున్న ఆయాలకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో పనిచేస్తున్న ఆయాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయాలతో సంవత్సరాల తరబడి వెట్టి చాకిరి చేయించుకుంటూ గౌరవ వేతనం పేరిట రూ. 6వేలు నామమాత్రం ఇస్తున్నారని.. ఈ వేతనం కుటుంబ పోషణకు ఎలా సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు కెసీ బాదుల్లా, చాంద్ బాష, ప్రభుత్వ పాఠశాలల ఆయాల యూనియన్ నాయకురాళ్లు గౌసియా, బుజ్జమ్మ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఆల్ న్యూ యాక్సెస్' విడుదల



నూతన వాహనాలతో ఖాజా సుజుకి షోరూం ప్రతినిధులు

కడప కల్చరల్: కడప నగరం చిన్నచౌకులోని ఖాజా సుజుకి షోరూం ఆధ్వర్యంలో ఆదివారం ఆల్ న్యూ యాక్సెస్-125 ద్విచక్ర వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సుజుకి మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ రీజినల్ మేనేజర్ కె.శివరామకృష్ణ, ఏరియా మేనేజర్ వై.శివప్రసాద్, ఖాజా గ్రూప్స్ ఎండీ సయ్యద్ మహమ్మద్ సొహైల్ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి వాహనాన్ని విడుదల చేశారు. తొలి వాహనాన్ని ఆర్ఎం శివరామకృష్ణ కొనుగోలుదారునికి అందజేశారు. ఏరియా మేనేజర్, సేల్స్ మేనేజర్‌లు రెండవ వాహనాన్ని, సంస్థ ఎండీ సొహైల్ మూడవ వాహనాన్ని అందించారు. కార్యక్రమంలో షోరూం సిబ్బంది, సబ్ డీలర్లు, ఫైనాన్స్ మేనేజర్లు, కొనుగోలుదారులు పాల్గొన్నారు.

అర్జున్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు



అర్జున్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న అవ్వారు మల్లికార్జున

కడప రూరల్: కడప నగరంలోని కో ఆపరేటివ్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అర్జున్ ఆసుపత్రిని శనివారం బీసీ చేతి వృత్తుల జాతీయ పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అవ్వారు అర్జున్‌కుమార్ మాట్లాడుతూ 50 పడకలతో ఆసుపత్రిని అత్యాధునికంగా ఏర్పాటు చేశామన్నారు. గైనకాలజిస్ట్ రాటాల శిరీష మాట్లాడుతూ రోగులకు 24 గంటల పాటు వైద్యులు, వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనిక సంఘం అధ్యక్షులు కేవీ రావు, కార్పొరేటర్ పాకా సురేష్, రాజారత్నం ఐజాక్, భరత్‌రెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీకరం.. శ్రీనివాస కల్యాణం

- హౌసింగ్‌బోర్డు రామాలయంలో కల్యాణ వైభవం
- టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహణ





కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు



మాంగల్యదర్శనం చేయిస్తున్న వేద పండితుడు

కడప కల్చరల్: శ్రీ శ్రీనివాస కల్యాణం శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో వార్షిక, రజతోత్సవాలను పురస్కరించుకుని నాలుగు రోజుల కార్యక్రమాల్లో భాగంగా మూడవరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్య కల్యాణమూర్తి...దేవదేవుడు శ్రీ వెంకటేశ్వరస్వామి, అమ్మవారల కల్యాణోత్సవాన్ని సాక్షాత్తు టీటీడీ సిబ్బందే స్వయంగా నిర్వహించడంతో సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి టీటీడీ నుంచి వేద పండితుల బృందం, ఇతర సిబ్బంది ప్రత్యేక వాహనాల్లో విచ్చేశారు. కల్యాణమూర్తులను ప్రత్యేకమైన రక్షణతో తీసుకొచ్చారు. కల్యాణానికి సంబంధించిన మిగతా అన్ని ఏర్పాట్లు టీటీడీయే సమకూర్చింది.

ఘనంగా గోవిందుని కల్యాణం

ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి కల్యాణ క్రతువు ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేసి కనుల పండువగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి అమ్మవారలను ఓవైపు కొలువుదీర్చి సమీపంలో శ్రీనివాసుడిని పట్టు పీతాంబరాలతో తీర్చిదిద్దారు. కార్యక్రమం కోసం ప్రత్యేకంగా విచ్చేసిన టీటీడీ వేద పండితులు తొలుత పుణ్యాహవాచనం, గణపతిపూజ తదితర కల్యాణ కార్యక్రమాలతో క్రతువును ప్రారంభించారు. కంకణధారణ, ప్రవరలు, మధుపర్కాల సమర్పణ తదితర క్రతువును క్రమంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తుల గోవింద నామస్మరణల మధ్య నిర్వాహకులు మేళతాళాలతో హరి నామ సంకీర్తనలు ఏర్పాటు చేశారు. గాయకులు అన్నమయ్య కీర్తనలను ఆలపిస్తూ ఆ ప్రాంతాన్ని ఆధ్యాత్మికంలో ఓలలాడించారు. అనంతరం అర్చకులు మహా మంగళసూత్రాలకు పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం చేయించారు. ఒక బృందం స్వామి పక్షాన, మరో బృందం అమ్మవారల పక్షాన నిలిచి కన్యాదానం కార్యక్రమాన్ని కమనీయంగా నిర్వహించారు. మేళతాళాలు, వేదమంత్రాలు ఆ ప్రాంగణంలో ప్రతిధ్వనిస్తుండగా అర్చక బృందం అమ్మవార్ల గళసీమల్లో అలంకరించారు. అడుగడుగునా భక్తి గీతాలాపనలతో కల్యాణోత్సవాన్ని ఆద్యంతం కమనీయంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పక్కపక్కనే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ ప్రతినిధులు భక్తులందరికీ భగవద్గీత చిరు పుస్తకాలను అందజేశారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారికి ఆలయ నిర్వాహకులు దేసు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ముత్యాల తలంబ్రాలు, అక్షతలు అందజేశారు. తర్వాత కల్యాణ విందును ఏర్పాటు చేశారు.



దైవస్మరణలో యువతి



అన్నమయ్యకీర్తనలను ఆలపిస్తున్నకళాకారులు



కల్యాణాన్ని తిలకిస్తున్నభక్తులు

ఉద్యోగ సంఘాలతో చర్చించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాష

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక అంశాలపై సంఘాలతో వెంటనే చర్చించాలని ఎస్టీయూ కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాష డిమాండ్ చేశారు. శనివారం కడపలోని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెలలో ప్రభుత్వం ప్రవేశ పెట్టే బడ్జెట్లో కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ప్రకటించిన ఎన్నికల హామీలకు సంబంధించిన నిధులను కేటాయించాలన్నారు. ముందుగా ఉద్యోగ సంఘాలను ఆర్థిక అంశాలపై చర్చలకు ఆహ్వానించాలని కోరారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి పెద్దలు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను ప్రకటించిందన్నారు. దీంతో పాటు ఆర్థికంగా నష్టపోయిన ఉద్యోగులకు కూడా ఎన్నికల హామీలో భాగంగా 12వ వేతన సవరణతోపాటు బకాయిల, డీఏల చెల్లింపు హామీలను ఇచ్చిందన్నారు. అలాగే వాటిని మేనిఫెస్టోలో కూడా చేర్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యోగ ఉపాధ్యాయులు ఎన్నో ఆశలను పెట్టుకున్నారని.. వాటిని నెరవేర్చాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్ బాబు, బాలగంగిరెడ్డి, రాష్ట్ర కన్వీనర్ రవిశంకర్ రెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామమోహన్, నగరశాఖ నాయకులు సాదిక్, రాజగోపాల్ రెడ్డి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీవేంకటరమణుడు



కల్పవృక్ష వాహనంపై సతీసమేత శ్రీవేంకటరమణుడు

పులివెందుల టౌన్ : పులివెందులలో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఐదవ రోజు వేంకటరమణుడు సతీసమేతుడై కల్పవృక్ష వాహనంపై కనువిందు చేశారు. అలంకరించిన ప్రత్యేక వాహనంలో కొలువుతీరిన స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో పురవీధులలో భక్తులు గోవిందనామ స్మరణలతో తమ భక్తిని చాటుకున్నారు. స్వామి ఐదు శేషుల పడగలపై నాట్యం చేస్తున్నట్లు కనిపించే తీరు భక్తులను ఆకట్టుకుంది. మహిళలు స్వామివారి రథాన్ని లాగుతూ గోవిందా.. గోవిందా నామజపాలతో ముందుకు కదిలారు. భక్తులు కాయ, కర్పూరాలు సమర్పించి వేడుకున్నారు. ఆలయంలో సాయంత్రం స్వామి వారిని పల్లకిలో ఉంచి సహస్ర దీపాలంకరణ సేవ చేశారు. ఊయలలో స్వామి ఊగుతుంటే భక్తకోటి పులకించింది.

'మనూ'లో సరికొత్త వృత్తి విద్యా కోర్సులు



సమావేశంలో పాల్గొన్న యూనివర్సిటీ డీన్ అబ్దుల్ వాహిద్, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: నగరంలోని మౌలానా ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల (మనూ) ప్రాంగణంలో రాబోయే విద్యాసంవత్సరం (2025-26) నుండి బాల-బాలికలకు సరికొత్త వృత్తి విద్యా కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు మనూ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొ. అబ్దుల్ వాహిద్ పేర్కొన్నారు. స్థానిక మనూ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం యూనివర్సిటీ డీన్ ప్రొ.అబ్దుల్ వాహిద్, సమానా కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ సీఈవో సమానా మౌసవి, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మిర్జా విలాయత్ అలీ బేగ్ సమావేశమయ్యారు. సమానా కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ సహకారంతో కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుండి ఆధునిక వృత్తి విద్యా కోర్సులను ప్రవేశ పెట్టే యోచనలో ఉన్నట్లు వారు ప్రకటించారు . 100 మంది బాలురకు 100 మంది బాలికలకు హాస్టల్ వసతి కల్పించి విద్యను అందించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అంతేకాకుండా రాబోవు విద్యా సంవత్సరానికి సంబంధించిన కోర్సులకు కూడా అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మొహమ్మద్ సికందర్ హుస్సేన్, డాక్టర్ అబ్దుల్ ఖ్వావీ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బీజేపీ విజయంపై సంబరాలు



సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న తరుణంలో కడప నగరంలో శనివారం పార్టీ నేతలు, కార్యకర్తలు జిల్లా బీజేపీ అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల్లో 27 సంవత్సరాల తరువాత బీజేపీ ఘన విజయం సాధించడం జరిగిందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సుపరిపాలన చూసి ఢిల్లీ వాసులు బీజేపీకి పట్టం కట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, రాష్ట్ర నాయకులు సింగారెడ్డి రామచంద్రా రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీ నారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు బీరం సుబ్బారెడ్డి, కడప అసెంబ్లీ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు పవన్ కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు సురేంద్ర, అశోక్ కుమార్ రెడ్డి , మునగా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జాకీర్ హుస్సేన్ సేవలు చిరస్మరణీయం



జాకీర్ హుస్సేన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: భారతదేశ మూడవ రాష్ట్రపతిగా సేవలందించిన దివంగత జాకీర్ హుస్సేన్ చిరస్మరణీయుడని జెకె సేవా సాంస్కృతిక విద్యా క్రీడా అభివృద్ధి సమితి రాష్ట్ర అధ్యక్షుడు లయన్ పటాన్ ఖాదర్‌బాష అన్నారు. జాకీర్ హుస్సేన్ జయంతి సందర్భంగా శనివారం తమ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట సమయంలో జాతిపిత మహాత్మాగాంధీకి తోడుగా జాకీర్ హుస్సేన్ పలు కార్యక్రమాల్లో పాల్గొని సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు అమీన్, ఆర్కే సేవా సమితి అధ్యక్షుడు కరీముల్లా, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం: పేద, నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినీలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.తులసమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా ఈ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని, లేని పక్షంలో తమ పాఠశాలలోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేస్తామని తెలిపారు.

నేడు సినీ నటుడు గౌతమ్‌రాజు రాక



కడప కల్చరల్: సినీ హాస్యనటుడు గౌతమ్‌రాజు ఆదివారం కడపకు రానున్నారు. రాజీవ్‌మార్గ్‌లోని శివశివాని హైస్కూలు వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు రానున్నట్లు పాఠశాల డైరెక్టర్ వీరబల్లి నాగేంద్రారెడ్డి, కరస్పాండెంట్ రమణి తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరగనున్న సభలో ఆయన ప్రసంగించనున్నట్లు వివరించారు. పూర్వ జేసీ శివారెడ్డి, కంటి వైద్యనిపుణులు డాక్టర్ స్వరూపరాణి అతిథులుగా హాజరవుతారని వివరించారు.


నేడు నృత్య సందడి

కడప కల్చరల్: కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా ప్రాచీన, కళా వారసత్వ, సంప్రదాయాలను చాటే నృత్యాల ప్రదర్శనను నిర్వహించనున్నట్లు పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 6.15 గంటలకు బద్వేలుకు చెందిన అనూష డ్యాన్స్ అకాడమి ప్రతినిధి బాబు శిష్యబృందం నృత్యాలను ప్రదర్శిస్తారన్నారు.

దళితులపై దాడులు ఆపాలి

కడప కార్పొరేషన్: దళిత వర్గాలే లక్ష్యంగా రాష్ట్రంలో జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలని జై భీమ్ మాల మహాసేన రాష్ట్ర అధ్యక్షులు పల్లెకొండు సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప నగరం 26వ డివిజన్ మాసాపేటలో దళిత నాయకులు త్యాగరాజుపై కేవలం దళితుడు ఏం చేయలేడు అని అతనికి సంబంధించి అన్ని అనుమతులు ఉన్నప్పటికి అతని ప్లాంట్ కూల్చడానికి అధికారులు పూనుకున్నారన్నారు. వందలాది మంది పోలీస్ యంత్రాంగంతో వాటర్ ప్లాంట్ కూల్చడానికి ప్రయత్నం చేశారన్నారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండా ఒక దళితుడిపై ఇలా దారుణం చేయడంపై జై భీమ్ మాల మహాసేన తరపున ఖండిస్తున్నామన్నారు. దీనిపై ఎస్సీ కమిషన్ కు ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేశామని, దళితులకు ఐదు రూపాయలకు మంచినీరు ఇస్తూ అందరికీ ఉపయోగంగా ఉండే ప్లాంట్ కూలదోయాలనుకోవడం సబబు కాదన్నారు. దళితులకు అండగా జై భీమ్ మాల మహాసేన, దళిత సంఘాలు ముందుండి పోరాడతాయని తెలిపారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహం



కడప రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ రెండు రోజుల క్రితం మృతి చెందింది. ఆ మహిళ ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని వైద్యులు తెలియజేశారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు.

దైవాన్ని అందించిన పరమ పునీత..లూర్దుమాత



విశేష అలంకారంలో లూర్దుమాత, శిలువతో విశ్వాసుల ఊరేగింపు

కడప కల్చరల్: లూర్దుమాత ప్రభువైన ఏసుక్రీస్తును పాపుల రక్షణ కోసం ఈ లోకానికి సమర్పించిందని, అందుకే ఆమె పరమ పునీత అయ్యారని రెవరెండ్ ఫాదర్ బెన్ని అన్నారు. లూర్దుమాత నవదిన కార్యక్రమాల్లో భాగంగా ఏడవరోజు శనివారం సాయంత్రం 5.30 గంటలకు మరియాపురంలోని పెద్ద చర్చి ఆవరణలో విశేష ప్రార్థనలు చేశారు. తొలుత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీపై లూర్దుమాత స్వరూపాన్ని నిలిపి విశ్వాసులు ఊరేగింపుగా మరియాపురం వీధుల ద్వారా స్తుతి గీతాలు ఆలపిస్తూ ప్రధాన ప్రార్థనా వేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆ స్వరూపాన్ని వేదికపై ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ బెన్ని మాట్లాడుతూ లోకం పాపులతో అస్తవ్యస్తంగా మారినపుడు ఈ పరిస్థితినుంచి విశ్వాసులను రక్షించడానికి ఆమె లోక రక్షకుడైన ఏసుక్రీస్తును ఈ ప్రపంచానికి అందించారన్నారు. ప్రజలు ఎన్ని నిందలు వేసినా ఆమె వారిని పాపాల నుంచి విముక్తులను చేయడం కోసం వాటిని భరించారని, అందుకే ఆమె పరమ పునీత అయ్యారని తెలిపారు. కడపకు చెందిన సీఆర్ఐ గురువులు దివ్య బలిపూజ నిర్వహించారు. మౌలిక సంఘం సభ్యులు ప్రధాన వేదికపై క్రైస్తవ స్తుతి గీతాలను ఆలపించగా, సీఆర్ఐ బృందం పీఠాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో కళ్లు చెదిరేలా అలంకరించారు.

ఉర్దూ స్కూళ్లపై ప్రభుత్వం కక్ష సాధింపు



విలేకరులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ షఫీ

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో రెండవ అధికార భాషగా ఉన్న ఉర్దూ భాషను వాట్సాప్ గవర్నెన్స్ లో పెట్టకపోవడం కూటమి ప్రభుత్వం కుటిల నీతిని బయట పెడుతోందని వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు తెలిపారు. శనివారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ షఫీ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల మాతృభాష ఉర్దూను ఊపిరి తీయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తున్నదన్నారు. విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న సాకుతో స్కూళ్లను మూసివేసి వేరే స్కూల్లో విలీనం చేసి అప్పటికే ఉన్న ఉర్దూ స్కూళ్లను మూసివేసే కుట్ర చేస్తున్నదని తెలిపారు. దీని వలన రాష్ట్రంలో 1390 ఉర్దూ పాఠశాలల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి సమున్నత స్థానం కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఉర్దూ స్కూళ్లలో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు నాడు-నేడు పథకం కింద అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నార్త్ జోన్ అధ్యక్షుడు బీహెచ్ ఇలియాస్, నగర మైనారిటీ అధికార ప్రతినిధి డీజీ అక్బర్ అలీ, నగర మైనారిటీ ఉపాధ్యక్షుడు అథా ఉల్లాహ్, మాజీ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మెంబర్ జఫరుల్లాహ్, 31 వ డివిజన్ కార్పొరేటర్ అజ్మతుల్లాహ్ ఖాన్, మహమ్మద్ అబ్దుల్లా, సాయి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథరెడ్డి

వల్లూరు : మండలంలోని బాలుగారిపల్లెలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా శనివారం న్యూ కేటగిరీ విభాగంలో నిర్వహించిన బండలాగుడు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పలు జిల్లాల నుండి మొత్తం 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలను వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ మాజీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఎస్ఎస్‌వీ ట్రేడర్స్, మల్లేల, విద్యా ఓబుల్ రెడ్డి రూకవారిపల్లె ఎద్దులు 4323 అడుగులు లాగి మొదటి రూ.50 వేలు, నంద్యాల జిల్లా అలగనూరుకు చెందిన రోలి మేడం ఎద్దులు 4150 అడుగులు లాగి రూ.40 వేలు, పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లెకు చెందిన విశ్వనాథరెడ్డి ఎద్దులు 4099 అడుగులు లాగి రూ.30 వేలు, పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన విష్ణువర్ధన్ రెడ్డి ఎద్దులు 4073 అడుగులు లాగి రూ.20 వేలు, కడప మండలంలోని ఖాదర్‌ఖాన్‌కొట్టాలుకు చెందిన భావన శ్రీ ఎద్దులు 3854 అడుగులు లాగి రూ.15 వేలు, ప్రొద్దుటూరుకు చెందిన తేజేశ్వర్‌రెడ్డి ఎద్దులు 3785 అడుగులు లాగి రూ.10 వేలను గెలుపొందాయి.

ఏఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

కడప రూరల్: ముస్లింలపై అనవసరంగా దుర్భాషలాడిన ఏఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ముస్లిం సంఘాల నేతలు కోరారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబూభాయ్, దస్తగిరి మాట్లాడుతూ కడప నగరం మృత్యుంజయకుంటలో జరిగిన స్వచ్ఛ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవిరెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారని తెలిపారు. కాగా ఆ ప్రాంతంలో ఉన్న ఏఎస్ఐ ముస్లింలను చిన్నచూపు చూడడంతో పాటు దూషించడం తగదన్నారు. బాధ్యతగల ఒక అధికారి అమర్యాదగా ప్రవర్తించడం తగదన్నారు. ఆ ఏఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.